క్లుప్తంగా

ఆగమోక్తంగా శని త్రయోదశి



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శ్రీశనీశ్వరస్వామి సన్నిధిలో శనివారం త్రయోదశిని పురస్కరించుకుని ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు



హోమ పూజల్లో చైర్మన్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: కేవీబీపురం మండలం మఠం గ్రామంలోని శ్రీవీరభద్రస్వామి ఆలయంలో మండల అభిషేక, హోమ పూజలు జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తం.. ప్రదోషం



నందికి అభిషేకం చేస్తున్న అర్చకులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లిలో ప్రసిద్ధ శ్రీ పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రదోష వేళలో నందీశ్వరునికి, మహాశివుడికి ఏకకాలంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చందనం, పన్నీరు తదితర సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాల నడుమ మహా హారతి, నక్షత్ర హారతి, కుంభ హారతి చేపట్టారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుదీర్చి ప్రాకారోత్సవం నిర్వహించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఉభయదారుగా వ్యవహరించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలకేంద్రంలోని పూజిత బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు శంకర నేత్రాలయ హాస్పిటల్ చెన్నై ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డైనమిక్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ తెలిపారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జవహర్‌రెడ్డికి సాదర స్వాగతం

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి శనివారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అతితిసింగ్, విమానాశ్రయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుపతికి బయల్దేరి వెళ్లారు.

ఉపాధి హామీలో కూలీల భద్రత ముఖ్యం

రేణిగుంట: ఉపాధిహామీ పనుల్లో కూలీల భద్రత ప్రధానమని, ప్రస్తుతం తీవ్ర ఎండలు కాస్తున్న దృష్ట్యా ఉదయం10.30 గంటల లోపు పనులను ముగించాలని, మధ్యాహ్నం 3.30పైన మళ్లీ పనులు చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ స్పష్టం చేశారు. శనివారం రేణిగుంట మండలం అత్తూరులో ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. పనుల నాణ్యతను తనిఖీ చేశారు. జాబ్ కార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. వేసవి దృష్ట్యా ఉపాధి కూలీలు వడదెబ్బకు గురికాకుండా పని జరిగే ప్రాంతం వద్ద నీడ కోసం విధిగా టెంట్లు వేయాలని సిబ్బందికి సూచించారు. మంచినీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్లను తప్పనిసరిగా అక్కడే ఉంచాలన్నారు. కూలీలకు కనీస వేతనం రూ.300 గిట్టుబాటు అయ్యేలా పని చేయించాలని సూచించారు. ఏపీవో జ్యోతిశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

మళ్లీ మామిడి తోటల్లోకి గజరాజులు

రేణిగుంట: మండలంలోని మామండూరు మామిడితోటల్లో శుక్రవారం బీభత్సం చేసిన ఏనుగుల గుంపు మళ్లీ శనివారం రాత్రి ప్రవేశించాయి. అక్కడ కాపలా ఉన్న రైతులు భయాందోళనలతో పరుగులు తీశారు. 15 ఏనుగులు 80 ఎకరాల్లోని తోటను నాశనం చే శాయి. ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించినా స్పదించలేదని రైతులు వాపోతున్నారు. కరకంబాడి చైతన్యపురం పొలాల్లోకి ఏనుగులు వచ్చే అవకాశం ఉండడంతో ఆ ప్రాంత రైతులు కూడా భయాందోళనకు గురవుతున్నారు.

నవరత్న పథకాలు దేశానికే ఆదర్శం

- వైఎస్సార్ సీపీని ఆదరించండి
- ఎన్నికల ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి



మామండూరు ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అమలు చేసిన నవరత్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి అన్నారు. శనివారం రేణిగుంట మండలం మామండూరు, కుక్కలదొడ్డి, బాలుపల్లె గ్రామాల్లో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటా ఆమెకు మహిళలు కర్పూర హారతులు పట్టారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..? అని అడిగి తెలుసుకున్నారు. నాలుగన్నరేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా నిలవాలని అభ్యర్థించారు. నాలుగన్నరేళ్లలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారని, కష్ట,సుఖాల్లో తోడుగా ఉంటున్నారన్నారు. ఓ పక్క ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూనే మరో పక్క తన సొంత నిధులతో అనేక సామాజిక కార్యక్రమాలను చేపట్టారన్నారు.

ప్రతిపక్షాలన్నీ ఏకమై కుట్రలు

నియోజకవర్గంలో మొన్నటి వరకు టికెట్ ఆశించి భంగపడిన వారంతా ఒక్కటై బియ్యపు మధుసూదన్‌రెడ్డిని ఓడించాలని కుట్ర చేస్తున్నారని, ప్రజలు విజ్ఞతతో ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని శ్రీవాణిరెడ్డి విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ ప్రజలు కరోనాలో ఉన్నప్పుడూ ఏ ఒక్కరూ తిరిగి చూడలేదన్నారు. రేణిగుంట మండలం గత ఎన్నికల్లో అత్యధిక మెజారిటీనిచ్చిందని, మళ్లీ ప్రజలు నిండైన దీవెనలతో అత్యధిక మెజారిటీని అందించాలని కోరారు. జగనన్న పాలనలో సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలే వైఎస్సార్ సీపీకి స్టార్ క్యాంపైనర్లని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, వైస్ ఎంపీపీ సుజాత, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గణేష్‌రెడ్డి, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, యోగేశ్వరరెడ్డి, సర్పంచ్ చిత్తూరు జయమ్మ, ఎంపీటీసీ ఆజీబాషా, మాజీ ఎంపీపీ జీడీపీ ప్రసాద్‌చంద్, విశ్వనాథ్‌యాదవ్, ఉప సర్పంచ్ మురగయ్య, నాయకులు మురళి, బాల, కావమ్మ, సుబ్బు, కడప సాహెబ్, గురవయ్య, భాస్కర్, మునిరత్నం, నగేషం, బుజ్జమ్మ, అరుణాదేవి, జ్యోతి, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



శ్రీవాణిరెడ్డికి ఆత్మీయ స్వాగతం

పారదర్శక పాలనకు అండగా నిలవండి



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ సత్యవేడు అభ్యర్థి నూకతోటి రాజేష్

నాగలాపురం: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని, ఇదే పాలన కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ అభ్యర్థి నూకతోటి రాజేష్ కోరారు. శనివారం నాగలాపురం మండలం వెళ్లూరు, ఎస్ఎస్‌పురం పంచాయతీల్లో పార్టీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు ఆధ్వర్యంలో రాజేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలు సజావుగా కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి మద్దతుపలకాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో ఇంటి వద్దకే పింఛన్లు అందజేశారని, పేదల పక్షపాతిగా ప్రభుత్వ పాలనను సచివాలయాల ద్వారా ఇంటి ముంగిటకు చేర్చారని చెప్పారు. ప్రజలంతా జగనన్న వెంటే ఉండడంతో ఓర్వలేని టీడీపీ కూటమి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. వలంటీర్లు ఇంటికే వెళ్లి పింఛన్లు పంపిణీ చేసే ప్రక్రియను ఎన్నికల ముసుగులో ఆపించడంతో మండుటెండల్లో వృద్ధులు, వికలాంగుల సచివాలయాలకు వెళ్లలేక కష్టాలు పడుతున్నారని తెలిపారు. టీడీపీ, జనసేనకు ప్రజల సంక్షేమంపై చిత్తశుద్ధి లేదన్నారు. ఎంతమంది జత కట్టి వచ్చినా జగనన్న పొత్తు జనంతోనేనని, రాబోయే ఎన్నికల్లో దుష్టశక్తులకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పేందుకు జనం సిద్ధంగా ఉన్నారని రాజేష్ తెలిపారు. మళ్లీ జగనన్న సీఎం అయితే రాష్ట్రంలో పేదరికం అనేది లేకుండా పోతుందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు బీరేంద్ర వర్మ, సర్పంచ్ చిన్నదొరై సుధ, ఎంపీపీ సింధూ, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు సునీత, జగదీష్ రెడ్డి, శ్యామ్, పళని, సుబ్రమణ్యం, దేశప్పన్, దేశన్, ఉదయ్ కుమార్, కులశేఖర్, చిరంజీవి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారంలో రాజేష్

యువతా.. అందుకో బ్రహ్మాస్త్రం



పిచ్చాటూరు: ర్యాలీలో పాల్గొన్న అధికారులు



నాగలాపురం: రెవెన్యూ సిబ్బంది అవగాహన ర్యాలీ



ఏర్పేడు: మాట్లాడుతున్న భవ్యకిషోర్

పిచ్చాటూరు: ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు హుస్సేన్ సాహెబ్ అన్నారు. శనివారం పిచ్చాటూరులో ఓటు హక్కు వినియోగంపై రెవెన్యూ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, డీటీ వెంకటేశన్, వీఆర్‌ఓలు, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

నాగలాపురం: మండల రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దార్ నరసింహులు ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

ఏర్పేడు: ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని రేణిగుంట డీఎస్పీ భవ్యకిషోర్ అన్నారు. శనివారం మండలంలోని అంజిమేడులో ఓటు హక్కుపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సీఐ శ్రీరామశ్రీనివాసులు, ఎస్ఐ జిలానీ పాల్గొన్నారు.

నేడు సత్యవేడులో రాజేష్ ప్రచారం

సత్యవేడు: మండలంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు కొల్లడం నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అనంతరం 9-30 రాజగోపాలపురం, 11 నుంచి 3 గంటల వరకు పీవీపురం, ఓబులరాజు కండ్రిగ, ఆనందాపురం ఎస్టీకాలనీ, చమర్తి కండ్రిగ, మోటుపాళెంలో, 4గంటలకు రేపల్లెవాడలో ప్రచారంలో పాల్గొంటారని వివరించారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఆరోగ్య సురక్షలో మెరుగైన వైద్యం



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

సత్యవేడు: ఆరోగ్య వైద్య శిబిరాలతో గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందుతోందని వైద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. శనివారం మండలంలోని ఏఎంపురంలో డాసుకుప్పం పీహెచ్‌సీ ఆధ్వ ర్యంలో రెండో విడత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారులు ఎస్.విద్యా సాగర్, మురళీ కృష్ణ, కంటి వైద్య నిపుణులు తేజస్వీ కలసి 274 మంది రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్ తదితర పరీక్షలు చేసి, మందులు అందజేశారు. 14 మందికి కంటి పరీక్షలు, 110 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్‌ఓ సుబ్రమణ్యం, ఎంఎల్‌హెచ్‌పీ సౌమ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులతో పవిత్రారెడ్డి

ఏర్పేడు: శ్రీకాళహస్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మండలంలోని మడిబాక పంచాయతీ రాజులకండ్రిగకు చెందిన టీడీపీకి చెందిన 25 మంది నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ చెంగల్‌రాజు ఆధ్వర్యంలో రాజులకండ్రిగకు చెందిన చెంగముని రాజు, సురేష్, దాశరాజు, లక్ష్మణ రాజు, ఎర్రమరాజు, నందరాజుతో పాటు మరో 25 మంది పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ రేణిగుంట మండల ఇన్‌చార్జ్ బియ్యపు పవిత్రారెడ్డి వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌రాజు, పత్రా సిద్దయ్య, గోపీ యాదవ్, మధురాజు, మణి రాజు, చలం రాజు, మునికృష్ణమ రాజు, భాస్కర్ రాజు, మురళీరాజు పాల్గొన్నారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరికి చెందిన కందప్పగారి సుబ్రమణ్యంరెడ్డి(67) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలు.. సుబ్రమణ్యంరెడ్డి కొన్నేళ్లుగా ఏర్పేడులో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామంలోని తన పొలంలో వ్యవసాయ పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. కాసేపటికే అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచన మేరకు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి గున్నేరి కిషోర్‌రెడ్డి రూ.5 వేలు అందించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

- ఆస్తి కోసమే హత్య
- వివరాలు వెల్లడించిన సీఐ



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడులో ఈనెల 2న సంచలనం రేపిన టి.రాజమ్మ హత్య కేసులో నిందితుల్లో ఒకడైన ఇళంగోవన్(30)ను అరెస్టు చేసినట్లు సీఐ భాస్కర్ నాయక్ తెలిపారు. శనివారం ఉదయం నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను పుత్తూరు రూరల్ సీఐ భాస్కర్ నాయక్ వివరించారు. ఆయన కథనం.. రాజమ్మకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రాజమ్మ భర్త ఆర్ముగం 20 ఏళ్ల కిందట మరణించాడు. పెద్ద కొడుకు మునస్వామి రెడ్డి గత ఏడాది మృతి చెందాడు. రాజమ్మ పేరిట 1.48 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. పెద్ద కుమారుడు మునస్వామి రెడ్డి కొడుకు హరికృష్ణ నాన్నమ్మ రాజమ్మ బాగోగులు చూసుకుంటున్నాడు. ఈ క్రమంలో రాజమ్మ తన పేరిట ఉన్న భూమిలో ఎకరా హరికృష్ణ పేరిట 14.02.2024న దాన సెటిల్మెంట్ రిజిస్ట్రేషన్ చేయించింది. అప్పటి నుంచి చిన్నకుమారుడు కృష్ణారెడ్డి, అతని భార్య గౌరి, ఇద్దరు కుమారులు ఆస్తిలో వాటా కోసం తరచూ గొడవపడుతూ వచ్చారు. ఆస్తిలో సగం వాటా ఇవ్వకుంటే చంపేస్తామని కృష్ణారెడ్డి ఫోన్ చేసి హరికృష్ణను బెదిరించాడు. దీనిపై హరిక్రిష్ణ, తల్లి దేవిక ఈనెల 2వ తేదీ పిచ్చాటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో రాజమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని చిన్నకొడుకు కృష్ణారెడ్డి, భార్య గౌరి, కుమారులు పురుషోత్తం, ఇళంగోవన్ చూశారు. ఆమె గొంతు కోసి పరారైనట్లు సీఐ వివరించారు. ఇందులో ఇళంగోవన్ నాన్నమ్మ గొంతు కోసి హతమార్చినట్లు వివరించారు. నిందితుడిని నాగలాపురం మండలం బైట కొడియంబేడు వద్ద అరెస్టు చేసినట్లు సీఐ వెల్లడించారు. మిగిలిన నిందితులను త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు వలంటీర్ల రాజీనామా

పిచ్చాటూరు: మండలంలోని నీరువాయి దళితవాడకు చెందిన వలంటీర్లు వెంకటేష్, చంద్రన్ శనివారం రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను ఎంపీడీఓ శ్రీనివాసులుకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ టీడీపీ నాయకుల వ్యాఖ్యలకు నిరసనగా తాము రాజీనామా చేసినట్లు తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేలా వైఎస్సార్ సీపీకి మెజారిటీ వచ్చేలా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తామని తెలిపారు. రెండు రోజుల క్రితం ఇదే గ్రామానికి చెందిన వలంటీర్ సంపత్‌కుమార్ రాజీనామా చేసిన సంగతి తెలిసిందే.

మాతా, శిశుమరణాలు తగ్గించడమే లక్ష్యం



వైద్య సిబ్బందితో సమావేశమైన డీపీఎంఓ శ్రీనివాసులు

సత్యవేడు: రక్త హీనతతో పిల్లలు, గర్భిణులు, బాలింతల మరణాలు తగ్గించడమే లక్ష్యంగా ఆరోగ్యశాఖ సిబ్బంది పని చేయాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ డీపీఓఎం డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం సత్యవేడు దళవాయి అగ్రహారం నాల్గవ సచివాలయం పరిధిలో జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో రక్త హీనత ఉన్న పిల్లలను, గర్భిణులను గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించారు. 20 మంది గర్భిణులు, 14మంది కిషోరబాలికలు, 14 మంది పిల్లలకు హిమో గ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు రక్త హీనత వల్ల కాన్పు సమయంలో అనేక సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. వైద్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో రక్తహీనత నివారణ మాత్రలను పంపిణీ చేయాలని ఆదేశించారు. సిబ్బంది బాధ్యతగా పనిచేసి రక్తహీనత కేసులు లేకుండా చూడాలన్నారు. గర్భిణులు సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. విటమిన్ సీ అధికంగా ఉండే ఉసిరికాయలు, పండ్లు, ఆరెంజ్, టమాటాలు, నల్లనువ్వులు, జీడిపప్పు, బెల్లం, ఖర్జూరం అధికంగా తీసుకోవాలన్నారు. డీపీహెచ్‌ఎన్‌ఓ బేబీరాణి, స్టాటిస్టికల్ అధికారి నాగేంద్రకుమార్, డీపీఓ ప్రకాష్, దాసుకుప్పం పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఓ సుబ్రమణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ నాగజ్యోతి, ఎంఎల్ హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

సుధీర్.. నోరు అదుపులో పెట్టుకో..

- ఆటో డ్రైవర్లను కించపరిస్తే ఖబడ్దార్
- యూనియన్ అధ్యక్షుడు సురేష్



మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్షుడు సురేష్

శ్రీకాళహస్తి: ఆటోడ్రైవర్లపై విషం చిమ్మితే ఖబడ్దార్ అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌ను ఆటోయూనియన్ అధ్యక్షుడు సురేష్ హెచ్చరించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు డ్రైవర్లకు ఎందుకు ఎమ్మెల్యే సీటు అంటుండగా, సుధీర్‌రెడ్డి ఆటోడ్రైవర్ల మనోభావాలు కించపరిచేలా వ్యాఖ్యానిస్తున్నారని ఆగ్రహించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆటో డ్రైవర్లను సమావేశానికి రమ్మని మా వాట్సప్ గ్రూప్‌లో మెసెజ్ పెట్టుకుంటే, దాన్ని సుధీర్‌రెడ్డి రాజకీయం చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు బెదిరించారని తమ ఆటో యూనియన్‌పై సోషల్ మీడియాలో ప్రచారం చేయడం బాధాకరమన్నారు. 30 సంవత్సరాలు 'నీ తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, ప్రస్తుతం నువ్వు ఆటో డ్రైవర్ల బాధలను ఏనాడు పట్టించుకున్నారా' అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నిత్యం ఆటో యూనియన్ వారితో కష్టసుఖాలను తెలుసుకుంటుంటారన్నారు. అందులో భాగంగా 80మంది ఆటోడ్రైవర్లకు తన సొంత డబ్బులతో లైసెన్సు ఇప్పించారని తెలిపారు. అనేక మంది ఆటో కార్మికులకు వాహన మిత్ర వచ్చేవిధంగా చర్యలు తీసుకున్నారని స్పష్టం చేశారు. ఆటోకార్మికుల బాధలను ముఖ్యమంత్రికి తెలిపే విధంగా సభ ఏర్పాటు చేస్తే దాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడు కోవడం సిగ్గు చేటని విమర్శించారు. మీ రాజకీయ బెదిరింపులకు తాము భయపడేది లేదని, మరోసారి ఆటో డ్రైవర్ల గురించి అనవసరంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

విమాన ప్రయాణికుడిపై కేసు

ఏర్పేడు: మద్యం సేవించి తోటి ప్రయాణికులను అసభ్య పదజాలంలో దూషించి, దౌర్జన్యం చేసిన విమాన ప్రయాణికుడిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీరామ శ్రీనివాసులు శనివారం తెలిపారు. వివరాలు.. అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం వరదయ్యగారిపల్లికి చెందిన కామినేని రెడ్డెయ్య నాయుడు శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి స్పైస్ జెట్ విమానంలో రేణిగుంటకు విమానశ్రయానికి చేరుకున్నాడు. రెడ్డెయ్య నాయుడు విమానంలో మద్యం సేవించి తోటి ప్రయాణికులు, విమాన సిబ్బందిని అసభ్యకర పదజాలంతో దుర్భాషలాడాడు. విమానాశ్రయంలో కెప్టెన్ ప్రకాష్ ఎం.పటేల్, సిబ్బంది ప్రీతిసింగ్, ప్రయాణికులు విమానాశ్రయ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అదుపులోకి కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

చేపల వేటకు వెళ్లి వృద్ధుడి దుర్మరణం

శ్రీకాళహస్తి : చేపలు వేటకు వెళ్లి చెరువులో దిగి ప్రమాదవశాత్తు ఓ వృద్ధుడు మృతిచెందిన సంఘటన మండలంలోని ముచ్చివోలులో శనివారం విషాదాన్ని నింపింది. రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం మేరకు.. ముచ్చివోలు గ్రామానికి చెందిన శ్రీనివాసులు(70) చేపలు పట్టేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. చెరువులో దిగి చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి ఊపిరాడక మృతిచెందాడు. నీటిలో తేలియాడుతున్న మృతదేహాన్ని గుర్తించి స్థానికులు సమాచారం అందించడంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీశారు. కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా గత ఫిబ్రవరి 5న శ్రీనివాసులు భార్య రత్నమ్మను అదే చెరువులో ప్రమాదవశాత్తు మునిగిపోతుండగా కోడలు మునిరత్నమ్మ కాపాడేందుకు యత్నించి, అత్తతోపాటు నీటిలో మునిగిపోయి మృతిచెందింది. ఆ ఘటన జరిగి రెండు నెలలు గడవక ముందే అదే కుటుంబంలో ఇలా జరగడం పెను విషాదాన్ని మిగిల్చింది.

ప్రేరణ ఉత్సవ్ పోటీలకు స్పందన

సత్యవేడు: స్థానిక ఎమ్మార్సీలో శనివారం విద్యార్థులకు మండల స్థాయిలో ప్రేరణ విజన్ ఇండియా, వికసిత్ భారత్ అంశాలపై వ్యాచరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలకు విశేష స్పందన లభించింది. వక్తృత్వ పోటీలో ఎన్.లేఖ(మదనంబేడు), డ్రాయింగ్‌లో వి.ధార్తీక(పుదుకుప్పం), హిందీ వక్తృత్వ పోటీలో ఎస్‌కె.మహ్మద్‌సాద్ (మదనంబేడు), పద్యపఠనంలో వి.ముగిల్ (పుదుకుప్పం) పాఠశాలల విద్యార్థులు విజేతలుగా ఎంపికయ్యారు.